క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ లోటస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్ ఒకటి, మూడు, లోటస్ ల్యాండ్ మార్క్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి ఐదో లైన్ వరకు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాయకాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాధానగర్, బర్మా కాలనీ, ప్రజాశక్తి నగర్, సుందరయ్య నగర్, ఎస్‌జే కిడ్స్ స్కూల్ రోడ్డు, బిండెల కంపెనీ రోడ్డు, డాక్టర్స్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపులకు నెలాఖరు వరకే గడువు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ. సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ తమ ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రెయినేజ్ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించవలసిందిగా ఆమె సూచించారు. పన్నులు చెల్లించని వారికి జూలై ఒకటో తేదీ నుంచి వడ్డీ పడుతుందని, నగర ప్రజలందరూ వడ్డీ పడకుండా, సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆమె సూచించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ గుణదలకు చెందిన టి.లలితానంద్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈవో శీనానాయక్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

33 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 33 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 33 మందిపై ఐదవ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 33 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు 14 మందికి ఒక్కొక్కరికి రూ. 15వేలు చొప్పున, మిగిలిన 19మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ప్రభుత్వాస్పత్రిలో పలువురు అధికారుల బదిలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. అందులో భాగంగా అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె. విజయలక్ష్మి రాజమండ్రి జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. డెప్యూటీ ఆర్ఎంఓలుగా పనిచేస్తున్న డాక్టర్ యు. శోభ ఏలూరు జిల్లా డీఐఓగా, డాక్టర్ శ్రీనివాసరాజు గుంటూరు జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంఓగా బదిలీ అయ్యారు. ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్యామ్‌కుమార్ మచిలీపట్నం బదిలీ కాగా, కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కావ్య విశాఖపట్నం బదిలీ అయ్యారు.

కాంట్రాక్టర్లకు జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శానిటేషన్, టోల్‌గేట్ కాంట్రాక్టర్లకు ఆలయ ఈఓ శీనానాయక్ జరిమానాలు విధించారు. గత ఆదివారం ఘాట్‌రోడ్డులో పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండటం, టోల్‌గేట్ నిర్వహణ సరిగా లేకపోవడంతో టోల్‌గేట్ కాంట్రాక్టర్ వీఎల్‌డీ ఏజెన్సీస్‌కి రూ. 25 వేలు జరిమానా విధించారు. అదేవిధంగా ఘాట్‌రోడ్డులోని ఈ టాయిలెట్స్‌కు శానిటేషన్ సిబ్బంది తాళాలు వేయడమే కాకుండా విధుల పట్ల అలసత్వం వహించారంటూ ఏజెల్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు రూ. 25 వేలు జరిమానాలు విధించినట్లు ఆలయ ఈఓ శీనానాయక్ పేర్కొన్నారు.

కాలం చెల్లిన బస్సులు

- రోడ్లపై మొరాయించడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- కొత్త బస్సుల ఊసే లేదు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బస్సు నిలిచిపోవడంతో మరో బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం మధ్యలో బస్సులు హఠాత్తుగా ఆగిపోతున్నాయి. డ్రైవర్లు ఎంత ప్రయత్నించినా ముందుకు కదలమంటూ బస్సులు మొరాయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు మరో బస్సునో, ఆటోనో ఆశ్రయించి ప్రయాణాన్ని సాగించాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం వెళ్తున్న ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల తీరుతో విసుగెత్తిపోతున్నారు.

రోడ్లపై నిరీక్షణ

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లే కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుంటారు. అయితే మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వారికి గుదిబండగా మారుతోంది. ఎక్కిన బస్సు ఎక్కడ ఆగిపోతుందో తెలియక సమయానికి తాము వెళ్లాల్సిన చోటుకి చేరుకుంటామో లేదో అని ఆందోళనతో నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు మొరాయిస్తే మరో బస్సు కోసం గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు

ప్రజా రవాణా వ్యవస్థలో అతిపెద్దదిగా గుర్తింపు ఉన్న ఆర్టీసీ క్రమేపీ ప్రయాణికుల ఆదరణకు దూరమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోకపోవడం, రద్దీకి తగినట్లుగా కొత్త బస్సులను ఏర్పాటు చేయకపోవడం, ఎప్పుడు ఆగిపోతాయో తెలియని కాలం చెల్లిన బస్సులను నడపటం ఇందుకు ప్రధాన కారణమనే అభిప్రాయం ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది. అయితే తమ ఉన్నతాధికారుల తీరు కారణంగానే ప్రజలు ప్రైవేటు వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆర్టీసీ సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు.



సాంకేతిక లోపంతో సింగ్‌నగర్ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మధ్యలో ఆగిపోతున్న బస్సులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, క్షేమం అని చెప్పే ఆర్టీసీ అధికారులు తమ ఇబ్బందులను మాత్రం పట్టించుకోవట్లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎక్కిన బస్సు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతే ప్రయాణం ఎలా సురక్షితం అవుతుందని ప్రశ్నిస్తున్నారు. బస్సు ఎక్కి టిక్కెట్ కొని బస్సు ఆగిపోతే తప్పనిసరి పరిస్థితిల్లో తిరిగి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో రెండు చోట్ల చార్జీలు చెల్లించుకోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వీర మోహనరావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో వచ్చేనెల 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు తెలిపారు. స్థానిక శ్రీదత్తసాయి మందిరంలో శుక్రవారం గురుపౌర్ణమి మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆయన భక్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ ఉదయం 5.30 గంటలకు కాగడ హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం ఏడు గంటలకు 21 దివ్యద్రవ్యములతో బాబావారికి అభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు శ్రీసాయి నక్షత్రమాలిక మండలి వారిచే శ్రీసాయినామ సంకీర్తన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. సాయంత్రం బాబావారి పల్లకీ ఉత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు శేజ్‌హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కావున భక్తులు గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొని బాబావారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని వినతి



సమావేశంలో మాట్లాడుతున్న రాజా

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమీ ఘాట్ ప్రాంతంలో వీఐపీల ప్రోగ్రామ్‌లు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల బృందాన్ని ఏర్పాటు చేయాలని విజయవాడ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 40వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నగరంలో రోజురోజుకీ చెత్త సేకరణ పెరిగిపోతున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య మాత్రం పెరగటం లేదని అన్నారు. ముఖ్యంగా రిటైరయినవారు, చనిపోయినవారు, అనారోగ్యంతో విధులకు హాజరు కాలేని పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య నానాటికీ తగ్గిపోతుందని తెలిపారు. డివిజన్ కార్మికులతో సంబంధం లేకుండా పున్నమీ ఘాట్ ప్రాంతంలో పది మంది వరకు కార్మికులు ప్రత్యేకంగా పనిచేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం డివిజన్ కార్మికులే ఆ ప్రాంతాన్ని కూడా చూడాల్సి రావడంతో వారిపై పని భారం పెరిగిపోయిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో నగరపాలక సంస్థ అధికారులు పున్నమీ ఘాట్‌పై దృష్టి పెట్టి పది మంది పారిశుద్ధ్య కార్మికులతో కూడిన ఒక బ్యాచ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విపత్తు నివారణపై అవగాహన



విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఊర్మిళ నగర్, పాత రాజరాజేశ్వరి పేట, జోజి నగర్ పరిసర ప్రాంతాలలో భారీ వర్షం, వరదలు వచ్చిన సమయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై వీఎంసీ సిబ్బంది ఆయా ప్రాంతాల స్థానికులకు అవగాహన కల్పించారు. మైకుల ద్వారా చైతన్యం కల్పించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల విపత్తుల సమయంలో వారికి దగ్గరలో ఉన్న పునరావాస కేంద్రాలు గురించి వీఎంసీ సిబ్బంది వివరించారు. విపత్తు సమయంలో ప్రజలకు సహాయపడటానికి వచ్చే సచివాలయం సిబ్బందికి సహకరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఎక్కువగా నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, అక్కడ ఇంజినీరింగ్ ప్రజారోగ్య సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాల్సిన పనులు మాక్ డ్రిల్ రూపంలో చూపించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ సోమ్రాజు, ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ డీఆర్ శర్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి వ్యక్తి జీవితంలో యోగ సాధన ఒక భాగంగా మారాలని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇగ్నో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపదైన యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి రావటం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. యోగ శిక్షకులు డి. హేమచంద్రరావు ఇగ్నో బృందంతో యోగ సాధన చేయించారు. సూర్య నమస్కారాలు చేయాల్సిన విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్. సాంబశివరావు, డెప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ బి. ప్రసాద్ బాబు, డాక్టర్ సుమలత ఇగ్నో సిబ్బంది పాల్గొన్నారు.

22న క్రియా యోగసాధన

పటమట(విజయవాడతూర్పు): క్రియాయోగ సాధనతో జీవితం ఆనందమయంగా మారుతుందని యోగదా సత్సంగ సొసైటీ (వైఎస్ఎస్) ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద అన్నారు. క్రియాయోగం అనేది ప్రతి మనిషి తనలోని దివ్యత్వాన్ని అనుభూతి చెందే శాస్త్రీయ విధానమని చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన ఆయన పటమటలోని వైఎస్ఎస్ ధ్యాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9.30 గంటలకు నగరంలోని శివరామకృష్ణ క్షేత్రంలో క్రియాయోగాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో అది ఒక భాగం కావాలని యోగా గురువు అంకాల సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కమిషనర్ ఆఫ్ ప్రింటింగ్ అండ్ స్టేషనరీ సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా యోగా గురువు అంకాల సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్. జహీర్, నాగవరపు శరత్‌చంద్ర, నాతి సీతారామరాజు, కె. జ్ఞానేశ్వర్, ఎ. రమేష్ బాబు, టి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంటిక్ ఏఐలో భారత్‌కి అగ్రస్థానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృత్రిమ మేధస్సుకు సంబంధించిన ఏజెంటిక్ ఏఐ వినియోగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని ప్రముఖ ఆర్కిటెక్ట్ ఏఐ నిపుణుడు డాక్టర్ రాజేష్ కుమార్ వర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'జెనరేటివ్ ఏఐ అండ్ ఏజెంటిక్ ఏఐ' అనే అంశం మీద ప్రసంగ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేష్ కుమార్ వర్మ మాట్లాడుతూ ప్రాథమికమైన చాట్‌బోట్స్‌కే పరిమితం కాకుండా సంక్లిష్టమైన వ్యాపార సమస్యల పరిష్కారం వైపు కంపెనీలు పరిశోధన చేస్తూ ఏజెంటిక్ ఏఐ నిపుణులకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. స్వల్పమైన మానవ ప్రమేయంతో స్వయం ప్రతిపత్తి నిర్ణయాలు తీసుకోగలిగిన కృత్రిమ మేధో వ్యవస్థలను తయారు చేయటమే ఏజెంటిక్ అన్నారు. దేశంలోని 10 శాతానికి పైగా అగ్రగామి కంపెనీలు జనరేటివ్ ఏఐ అంశం మీద ప్రయోగాలు చేస్తున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచి ఏఐ మీద సమగ్రమైన అవగాహన ఉంటే గొప్ప స్థాయి ఉద్యోగాలను అందుకోవటం చాలా తేలిక అవుతుందని వర్మ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి, హిందూహైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు ప్రసంగించారు. కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాంపవన్, పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య ఎస్. శివకుమార్ పర్యవేక్షణలో 24 మంది చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.



బుక్ ఫెస్టివల్ సొసైటీకి పుస్తకాల వితరణ



బుక్ ఫెస్టివల్ సొసైటీకి పుస్తకాలను అందజేస్తున్న ప్రసాద్

విజయవాడ కల్చరల్: విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మెండెపు ప్రసాద్ పోటీ పరీక్షలకు సంబంధించి రూ. 10 వేల విలువైన పుస్తకాలను విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధిన పుస్తకాలను దాతలు నిర్వాహకులకు అందజేయాలని కోరారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మనోహర నాయుడు, లక్ష్మయ్య, ఎమెస్కో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా శ్రీవత్స భరతనాట్య రంగ ప్రవేశం



భరతనాట్యం అంశాలను ప్రదర్శిస్తున్న శ్రీవత్స

విజయవాడ కల్చరల్: ప్రవాసాంధ్ర యువ కళాకారుడు ఆకెళ్ల శ్రీవత్స భరతనాట్య సంప్రదాయంలో దుర్గాపురంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో శుక్రవారం ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. నృత్య సంప్రదాయాన్ని అనుసరించి పూర్వరంగంతో ప్రారంభించి, పుష్పాంజలి, అలరింపు, జతి స్వరం, శబ్దం, అన్నమయ్య సంకీర్తన, జయదేవుని అష్టపది, పదం, వర్ణం, థిల్లానా అంశాలను నాట్యాచార్యుడు ఎమ్ కాశీ విశ్వనాథ్ పర్యవేక్షణలో మనోహరంగా నృత్యాలను ప్రదర్శించారు. పాలర్తి నాగేశ్వరరావు, వనమాలి, సురేష్ బాబు, పసుమర్తి పావని వాద్య సహకారం అందించారు. ప్రారంభ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు కందుల లక్ష్మీనరసమ్మ, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, లంకా భవానీ, పీ కేదారనాథ్, ప్రవాసాంధ్ర తెలుగు ప్రముఖులు శ్రీశ, సుధలక్ష్మి పాల్గొని యువ నృత్య కళాకారుడు శ్రీవత్సను అభినందించారు. విశ్రాంత బ్యాంక్ అధికారి యడవల్లి నాగేశ్వరరావు నిర్వహించారు.

లక్ష్మీనగర్‌లో వరుస చోరీలు


రెండు ఇళ్లల్లో బంగారం, నగదు చోరీ



లక్ష్మీనగర్‌లోని రమాదేవి ఇంట్లో చిందర వందరగా పడేసిన బీరువాలోని దుస్తులు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్థానిక సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి వరుసగా రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పంచాయతీ రాజ్ శాఖ రిటైర్డ్ డీఈ కేవీ రమాదేవి సత్యనారాయణపురం, లక్ష్మీనగర్ కాలనీలోని ఎల్ఆర్‌డబ్ల్యూఏలో ప్లాట్ నెంబర్ 370లో నివాసం ఉంటుంది. ఇటీవలే ఆమె కెనడాలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లింది. శుక్రవారం ఉదయం పనిమనిషి ఇంటికి వెళ్లగా ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటంతో వెంటనే నగరంలోనే ఉంటున్న రమాదేవి చెల్లికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ. 50వేలు నగదు, రెండు బంగారు ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా వారి ఇంటి సమీపంలోనే ఎల్ఆర్‌డబ్ల్యూఏలో నివాసం ఉంటున్న కోడే కోటేశ్వరరావు నివాసంలో కుటుంబ సభ్యులు నిద్రించిన సమయంలో దొంగలు చొరబడి బీరువాలోని రూ. 10వేలు చోరీ చేశారు. దీనిపై బాధితులు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జూనియర్ విభాగంలో ఫస్ట్ ప్రైజ్ పొందిన చిత్రం



సీనియర్ విభాగంలో ఫస్ట్ ప్రైజ్ పొందిన చిత్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ): యోగాసనాలపై అవగాహన కల్పించే విధంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులను జూనియర్, సీనియర్ కేటగిరీలుగా విభజించి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇదే పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేసి రిటైరైన జి. వెంకట్రావు నేతృత్వంలో జరిగిన ఈ పోటీలో యోగాపై విద్యార్థులు చిత్రించిన చిత్రాలలో వారి ఆలోచనలు ప్రతిబింబించాయి. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఆర్‌బీ ఉదయ్ కిరణ్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు జీ సురేష్ కలిసి విద్యార్థులను యోగాంధ్ర – 2025, జీఎస్ఆర్ అక్షరాల ఆకారంలో కూర్చోబెట్టి యోగాసనాలు వేయించారు. కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీ రవికుమార్ పర్యవేక్షించారు. కాగా పోటీలో వచ్చిన చిత్రాల్లో ఉత్తమమైనవాటిని పాఠశాలలో ప్రదర్శించారు.

మాస్టర్ ప్లాన్ పనులపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈఓ శీనానాయక్ ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఈఓ చాంబర్‌లో శుక్రవారం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 23వ తేదీన ఆలయ అభివృద్ధి పనులపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం జరగనుందని తెలిపారు. ఆలయానికి సంబంధించి ఇప్పటి వరకు జరిగిన పనులు, రానున్న రెండు, మూడు నెలల్లో ఏ మేరకు పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయనే అంశాలతో ఈ సమీక్షకు అధికారులందరూ హాజరు కావాలన్నారు. మాస్టర్ ప్లాన్ పనులు మరింత వేగంగా పూర్తయితే రానున్న దసరా, భవానీ దీక్షలకు భక్తులకు మరిన్ని సదుపాయాలను కల్పించవచ్చని ఈఓ శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.